క్లుప్తంగా

ఘనంగా బళ్లమ్మ తల్లి తీర్థం


ప్రత్యేకాలంకరణలో బళ్లమ్మ అమ్మవారు

పెదపూడి: గ్రామంలో కొలువైన, ప్రసిద్ధి చెందిన బళ్లమ్మ వారి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా బళ్లమ్మ వారికి పేరుంది. అమ్మవారి తీర్థానికి మండల నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరయ్యారు. అమ్మ వారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి అమ్మ వారిని దర్శించుకోడానికి భక్తుల బారులు తీరారు. భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. స్థానికులు, స్వచ్ఛంద సంస్థల వారు చలివేంద్రాలు ఏర్పాటు చేసి, భక్తులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు ఉచితంగా సరఫరా చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో గ్రామంలో సందడి నెలకొంది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సై కె.రామారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఇలాఉండగా బళ్లమ్మ తల్లిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకున్నారు. అలాగే ఏపీత్రయంలో పళ్లాలమ్మను, పెద్దాడలో వనుములమ్మను, రామేశ్వరంలో మహాలక్ష్మి అమ్మవారిని కూడా దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పేలిన తారు ట్యాంకర్


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాజానగరం: దివాన్‌చెరువు శివారు బీజాపురి టౌన్‌షిప్‌లో తారు ట్యాంకర్ పేలి, రెండు ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రెండు భాగాలుగా ఉన్న ట్యాంకర్‌లో ఒక భాగంలోని తారును కరిగించే క్రమంలో మంట పెట్టారు. అప్పటికే దానిలో గ్యాస్ నిండి ఉండడంతో ట్యాంకర్ పేలి, మంటలు ఎగసిపడ్డాయి. పేలుడు తీవ్రతకు సమీపంలోని రెండు ఇళ్ల శ్లాబ్‌లు బీటలు తీశాయి. విషయం తెలుసుకున్న రాజమహేంద్రవరం అగ్నిమాపక దళం హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని, ఫోమ్‌తో మంటలను అదుపు చేశారు.

ఘనంగా మహాలక్ష్మీ అమ్మవారి తీర్థం


కానేడు మహాలక్ష్మీ అమ్మవారు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం శివారులో కానేడులో ఉన్న మహాలక్ష్మీ అమ్మవారి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. శనివారం రాత్రి వైభవంగా జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా బలభద్రపురం, పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతానగరం: మండలంలోని కొన్ని గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ పోలవరం కెనాల్ ఫీడర్ బ్రేకర్ నిర్మాణం కోసం సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు చెప్పారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, దేవీపట్నం మండలం నేలకోట గ్రామాలకు, అలాగే తొర్రిగడ్డ ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

బీసీలకే మార్కెట్ చైర్మన్ పదవి ఇవ్వాలి

రాజానగరం: స్థానిక మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని టీడీపీలో రాజానగరం మండలంలో బీసీలకు ఇవ్వాలని ఆ పార్టీ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ వంక మల్లిబాబు, ఇతర నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి వినతి పత్రం అందజేశామని మల్లిబాబు ఆదివారం ఇక్కడ విలేకరులకు తెలిపారు.

జూదరుల అరెస్టు

సీతానగరం: రాపాకలో పేకాట ఆడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ.2 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని, నిందితులను కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై తెలిపారు.

ఆడబిడ్డపై పసిడి పంజరం



- గణనీయంగా పెరిగిన బంగారం ధర
- తల్లిదండ్రులకు భారంగా మారిన పెళ్లిళ్లు
- గగ్గోలు పెడుతున్న పేద, మధ్య తరగతి వర్గాలు
- విక్రయాలు తగ్గాయంటున్న సువర్ణ వ్యాపారులు
- ప్రభావం చూపుతున్న అంతర్జాతీయ పరిణామాలు

కాస్తంత బంగారం దాచిపెడితే.. ఆడబిడ్డ పెళ్లికి అక్కరకొస్తుందన్న ఆలోచన పాత తరం మహిళల్లో బలంగా ఉండేది. ఈ హైటెక్ తరంలో మాత్రం.. చేతిలో కాసిన్ని డబ్బులుంటే చాలు ఎప్పుడు, ఎలా ఖర్చు పెట్టేద్దామన్న ఆలోచనే. పెద్దలు కూడబెట్టిన ఆస్తిపాస్తులే నేటి తరానికి ఆసరాగా ఉంటున్నాయనడంలో సందేహం లేదు. కానీ.. పేద, మధ్య తరగతి బతుకుల్లో మాత్రం బంగారం ధర.. పెద్ద అలజడే సృష్టిస్తోంది. ఆడబిడ్డల పెళ్లిళ్లకు పెద్ద అవరోధంగా మారుతోంది. తల్లిదండ్రులు బంగారం కొనే స్తోమత లేకపోవడంతో.. వారి బిడ్డల జీవితాలకు 'పసిడి' పంజరంలా మారుతోంది.

సీతానగరం: పసిడి ధరలు నింగినంటాయి. ఆడబిడ్డల పెళ్లిళ్లు భారంగా మారాయి. సాధారణ ఉద్యోగులు, వ్యవసాయదారుల సంపాదన ఇంటి అవసరాలకే అంతంతమాత్రంగా ఉన్నాయి. ఉద్యోగులకు వ్యక్తిగత రుణాలు సులభంగా లభిస్తాయి. గ్రామాల్లో ఉన్న భూమి అమ్ముకోవాలంటే ధర ఆశించిన మేరకు లేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక రిజిస్ట్రేషన్ చార్జీలు అమాంతం పెంచేయడంతో భూమి కొనేవారు కరవయ్యారు. దీంతో అవసరాల కోసం అయినకాడికి అమ్ముకుని, బిడ్డ పెళ్లి చేసి పంపిద్దామంటే కనీస స్థాయిలో బంగారం కూడా సర్దుబాటు చేసే ఆర్థిక పరిస్థితి లేక, ఏం చేయాలో పాలుపోక తలపట్టుకుంటున్నారు.



కాపాడుతున్న 'ముందుచూపు'

పాత బంగారం ఉన్నవాళ్లు, ధర తగ్గిన సందర్భాల్లో కొని దాచుకున్న వాళ్లు, ముందుచూపుతో బంగారం కొన్నవాళ్ల పరిస్థితి కాస్తంత ఆశాజనకంగా ఉంది. ప్రైవేట్ సంస్థలు, బ్యాంకుల్లో బంగారు అభరణాలు కుదువ పెట్టినవారు, ఎన్ని ఇబ్బందులు పడినా, వడ్డీ చెల్లించి మరీ బంగారాన్ని కాపాడుకుంటున్నారు. ఎటొచ్చీ పాత బంగారం దాచుకోక, కొత్తగా కొనుగోలు చేయాలనుకునే వారి పరిస్థితి మాత్రం దారుణంగా ఉంది. చాలామంది తల్లిదండ్రులు తమ ఆడబిడ్డలకు పెళ్లిళ్లు చేయడం గగనమవుతోంది. కొన్నిచోట్ల వాయిదాలు వేసుకోవాల్సిన పరిస్థితి. కళ్లెం లేని బంగారం ధర అనేక కుటుంబాల్లో కల్లోలం రేపుతోంది.

అంతర్జాతీయ పరిణామాలిలా..

వివిధ దేశాల్లో ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం, ఆర్థిక అనిశ్చితి, తక్కువ వడ్డీ రేట్లు, డాలర్ బలహీనం కావడం వంటి పరిణామాలు బంగారం ధరపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వివిధ దేశాల మధ్య యుద్ధ వాతావరణం, ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విపరీత ధోరణి వంటి చర్యలతో డాలర్ విలువ గణనీయంగా పడిపోతోంది. దీంతో మదుపరులు బంగారంలో పెట్టుబడులు పెడుతున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో బంగారం వాటా పెంచే చర్యలు చేపడుతోంది. ఆయా కారణాల వల్ల బంగారం ధర దూసుకుపోతోందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

కొండెక్కిన ధర

ఐదేళ్ల క్రితం కరోనా లాక్‌డౌన్ సమయంలో 2020 మార్చి 22న బంగారం తులం ధర నాణ్యతను బట్టి రూ.30 వేల నుంచి రూ.32 వేలు పలికింది. అదే ఏడాది అక్టోబర్ 10 నుంచి దీని ధర ఎగబాకుతూనే ఉంది. గత ఆరు నెలలుగా పోలిస్తే పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. 2024 నవంబర్‌లో 24 క్యారెట్లు 10 గ్రాముల బంగారం ధర రూ.77 వేలు ఉండగా, ఇటీవల రూ.లక్ష దాటి.. శనివారానికి రూ.97,777గా ఉంది. అలాగే 22 క్యారెట్ల బంగారం ధర రూ.89,999 కు చేరింది. ఈ ఐదేళ్లలో బంగారం ధర దాదాపు మూడింతలైంది. ఒకప్పుడు బంగారాన్ని ప్రధానంగా అలంకరణలకు వినియోగించేవారు. ప్రస్తుతం సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. బ్యాంకుల్లో దాచుకున్న డబ్బుపై వడ్డీ రేట్లు పెద్దగా రాకపోవడమే ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

భారంగా మారిన కొనుగోలు



ఆడపిల్లలున్న తల్లిదండ్రులకు బంగారం ధర ఆందోళన గురి చేస్తోంది. పిల్లలకు పెళ్లిళ్లు చేయాలని నిర్ణయించుకుంటే ముందుగా బంగారం గురించే ఆలోచిస్తారు. ధర విపరీతంగా పెరగడంతో బంగారం కొనుగోలు చేయలేక అమ్మాయి వివాహం తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా మారుతోంది. పసిడి రోజురోజుకూ కొండెక్కుతోంది.

– మట్ట శ్రీనివాస్, నాగరత్నం కాలనీ, సింగవరం

వ్యాపారాలు డీలా..



ఆరు నెలలుగా బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం బంగారం ధరపై ఉంటోంది. ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు ఎగబాకడంతో కొనుగోళ్లు సగానికి సగం పడిపోయాయి. అంతర్జాతీయ పరిణామాల కారణంగా బంగారం ధరపై తీవ్ర ప్రభావం పడుతోంది. బంగారం వ్యాపారం అంతగా లేదు.

– యర్రోజు రామాచార్యులు, బంగారం వ్యాపారి, సీతానగరం

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో నియామకాలు

పెదపూడి: అనపర్తి నియోజకవర్గానికి సంబంధించి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులకు జిల్లా కమిటీలో పదవులు లభించాయని పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా అధికార ప్రతినిధిగా అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షునిగా రంగంపేట మండలం దొడ్డిగుంట గ్రామానికి చెందిన అడబాల వెంకటేశ్వరరావు, జిల్లా యాక్టివిటీ కార్యదర్శులుగా రంగంపేట మండలం వడిశలేరు గ్రామానికి చెందిన కొల్లాటి ఇజ్రాయేలు, అనపర్తి మండలం కొప్పవరం గ్రామానికి చెందిన తాడి సూరారెడ్డి, జిల్లా అర్గనైజింగ్ కార్యదర్శులుగా పెదపూడి మండలం కరకుదురు గ్రామానికి చెందిన వాసంశెట్టి మాధవ, బిక్కవోలు మండలం కొంకుదురు గ్రామానికి చెందిన పడాల వీరవెంకట సత్యనారాయణరెడ్డి(పీవీ) నియమితులయ్యారు. వీరందరికీ ఆయన అభినందనలు తెలిపారు. అలాగే ఆయా నియామకాలకు సహకరించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర యుజవన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం


విజయ దుర్గాంబిక అమ్మవారు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామ ఇలవేల్పు విజయ దుర్గాంబిక ఆలయ వార్షికోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ, ఉదయం 8 గంటలకు అమ్మవారికి ఆలయ అర్చకుడు కోడూరి వెంకటరత్నం, నారాయణ శర్మ ప్రత్యేక సహస్ర నామార్చన పూజలు, మధ్యాహ్నం మహాన్నదానం, రాత్రి సామూహిక భజనలు ఉంటాయని వివరించారు.

కోలాహలంగా ఎడ్ల పట్టు పందేలు


ఎడ్ల పట్టు పందెం దృశ్యం


విజేతలకు షీల్డ్ అందజేస్తున్న అతిథులు

రాజానగరం: చక్రద్వారబంధం గ్రామంలో ఎడ్ల పట్టు పందేలు (ఎడ్లతో ఉన్న బండికి చక్రాలు తిరగకుండా తాళ్లతో కట్టి, వాటిపై బరువుతో కూడిన ఇసుక మూటలు పెట్టి జరిపే పందేలు) ఆదివారం కోలాహలంగా నిర్వహించారు. ముంగర తాతి, గంగరాత్నం జ్ఞాపకార్థం వారి కుమారుడు రాంబాబు ఆధ్వర్యాన స్థానిక రైసు మిల్లు లే అవుట్‌లో ఈ పందేలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి 17 జతల ఎడ్ల పాల్గొనగా, ఐదింటిని విజేతలుగా ఎంపిక చేసి, వాటి యజమానులకు షీల్డులు బహూకరించారు. మొదటి స్థానంలో మురమళ్ల రాంబాబు (మూలస్థానం), రెండో స్థానంలో పడాల రాంబాబు (బడుగువానిలంక), మూడో స్థానంలో వెలి శ్రీరామ్ (చింతల నామవరం), నాలుగో స్థానంలో ముంగర నాగేశ్వరరావు (చక్రద్వార బంధం), ఐదో స్థానంలో మిద్దే సురేష్ (మురమండ) నిలిచారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు


రాజానగరంలోని శాఖా గ్రంథాలయం

రాజానగరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించే ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని లైబ్రేరియన్ కలగర సత్యనారాయణ తెలిపారు. జూన్ ఆరు వరకు జరిగే ఈ కార్యక్రమంలో వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, పాటలు, దేశభక్తి గీతాలు, క్రాఫ్ట్ వర్క్, కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణ ఇస్తారని వివరించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రంగంపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభిస్తున్నట్టు గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, జూన్ 6 వరకు ఈ తరగతులు జరుగుతాయన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని చెప్పారు. విజ్ఞానవంతులు కావడానికి గ్రంథాలయాలు దోహదపడతాయన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణా తరగతుల్లో కథలు చెప్పడం, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, స్పోకెన్ ఇంగ్లిష్, నృత్యం, గణితం, సృజనాత్మక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 40 రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందన్నారు.

పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలు


విద్యార్థులను సత్కరిస్తున్న ఇజ్రాయేలు, శ్యామలావతి దంపతులు

రంగంపేట: కృషి, పట్టుదలతో చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరవచ్చని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి దంపతులు అన్నారు. మండలంలోని వడిశలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆత్కూరి లక్ష్మీ ప్రియాంకర్ (583), పాలా హెచ్ఎస్‌వీవీ కృష్ణ (576) ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, మండలంలో ప్రథమ, తృతీయ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం వారిని ఇజ్రాయేలు, శ్యామలావతి దంపతులు సత్కరించారు. అదే విధంగా పాఠశాల స్థాయిలో తృతీయ స్థానం సాధించిన ఉయ్యూరి దేవీమౌనిక (567)ను కూడా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంచి మార్కులు సాధించి గ్రామానికి, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. ఇదే పట్టుదలతో చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

రెండు తాటాకిళ్లు దగ్ధం


మంటల్లో కాలిపోతున్న ఇళ్లు

రాజానగరం: తూర్పుగానుగూడెంలో ఆదివారం రాత్రి రెండు తాటాకిళ్లు దగ్ధమై, సుమారు రూ.ఆరు లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో పి.ముత్యాలరావు, ఎస్.రామస్వామి కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. ప్రమాద సమయంలో ఆ ఇళ్లల్లో ఎవ్వరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ముత్యాలరావు కుమార్తెకు చెందిన టెన్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో పాటు, రెండిళ్లలోని నిత్యావసర వస్తువులు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది రాజమహేంద్రవరం నుంచి వచ్చినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అప్పటికే నష్టమంతా జరిగిపోయిందని బాధితులు వాపోయారు. బాధితులను సర్పంచ్ గళ్లా సత్యశ్రీ దంపతులు పరామర్శించారు.

నగర వాసి నింశీకి గిన్నిస్ రికార్డు


ఆడమ్స్



రికార్డ్ ధ్రువపత్రాన్ని అందుకుంటున్న ఆడమ్స్ తల్లిదండ్రులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరానికి చెందిన డాక్టర్ సొంగ ఆడమ్స్ నింశీ(26) గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి ధ్రువపత్రం అందుకున్నారు. విజయవాడలోని హలెల్ సంగీత పాఠశాలలో కీబోర్డు నేర్చుకున్న ఆడమ్స్ గతేడాది డిసెంబర్ ఒకటిన ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన సంగీత వాయిద్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ఇందులో 18 దేశాల నుంచి 1,100 మంది సంగీత కళాకారులు పాల్గొని, ఆన్‌లైన్‌లో సరళీ స్వరాలను గంట పాటు కీబోర్డుపై ఆలపించారు. ఆ వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్లోడ్ చేసి ఈ ఘనత సాధించినట్లు ఆడమ్స్ తెలిపారు. మొత్తం 1,100 మంది ఈ ప్రదర్శనలో పాల్గొనగా, 1,046 మంది ఈ రికార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. ఆడమ్స్ తండ్రి సునీల్ గతంలో రాజమండ్రి ఈపీఎఫ్ ఆఫీసులో పనిచేసి, ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం లాలాచెరువు ఎస్‌బీఐ కాలనీలో ఉంటున్నారు. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో హలెల్ సంగీత పాఠశాల వ్యవస్థాపకులు పాస్టర్ అగస్టీన్ దండిగి నుంచి ఆడమ్స్ తల్లిదండ్రులు సునీల్, రోజారాణి గిన్నిస్ ధ్రువపత్రం అందుకున్నారు. ఆడమ్స్ ఇటీవలే విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్లారు. ఏఈవో సంఘ రాష్ట్ర అధ్యక్షులు డి.వేణుమాధవరావు, కాతేరు, మురమళ్ల వైఎంసీఏ అధ్యక్షులు గుళ్ల మార్టిన్ శాంతిమార్, సునీల్‌కుమార్ అభినందనలు తెలిపారు.

గొడుగులమ్మ వారి ఆలయం వద్ద అన్న సమారాధన

కోరుకొండ: జంభూపట్నం గ్రామ దేవత గొడుగులమ్మవారి ఆలయం వద్ద ఆదివారం అన్న సమారాధన జరిగింది. ఇటీవల అమ్మవారి జాతర మహోత్స వాలు జరిగాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అమ్మవారి ఉత్సవ కమిటీకి రూ.40 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

పహల్‌గాం ఘటనపై శాంతి ర్యాలీ



బొమ్మూరులో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం మహిళలు


సౌత్ సెంట్రల్ రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో..

రాజమహేంద్రవరం రూరల్: జమ్మూ–కశ్మీర్‌లోని పహల్‌గాం వద్ద పర్యాటకులపై ఉగ్రవాదుల జరిపిన దాడిని నిరసిస్తూ బొమ్మూరులో ముస్లింల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పెద్దఎత్తున కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదాన్ని అరికట్టాలి, నిందితులను కఠినంగా శిక్షించాలి, హిందూ ముస్లిం భాయ్ భాయ్, మేరా భారత్ మహాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మహిళలు మాట్లాడుతూ, అమాయక పర్యాటకులను ఉగ్రవాదులు హతమార్చారని, ప్రతి పౌరుడు ఈ దాడిని ఖండించాలన్నారు. ఉగ్రవాదుల చేతిలో అసువులు బాసిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ ర్యాలీ బొమ్మూరు సెంటర్ మీదుగా దోసాలమ్మ గుడి, కాపులవీధి మీదుగా మసీదు వద్దకు చేరుకుంది.ఈ ర్యాలీకి పలు సంఘాల నేతలు మద్దతు తెలిపారు. ఈ ర్యాలీలో ముస్లిం మహిళలు, ముస్లిం యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో..

రాజమహేంద్రవరం సౌత్ సెంట్రల్ రైల్వే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పహల్‌గాంలో ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్కౌట్ డెన్ నుంచి బాలాజీపేట ఎస్‌బీఐ, ఐఎల్‌టీడీ జంక్షన్ మీదుగా రైల్వేస్టేషన్ వద్ద రైల్వే రక్షణ దళం వద్దకు చేరుకున్నారు. స్కౌట్ మాస్టర్ ఎస్‌వీ భద్రరావు, ఎస్ఆర్‌వీ బ్రహ్మేశ్వరరావు, స్కౌట్ యోగా మాస్టర్ కేఎస్‌వీ శ్రీధర్‌రెడ్డి సారథ్యంలో 60 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్, రైల్వే రక్షక దళం అధికారులు పాల్గొన్నారు.